క్లుప్తంగా

వీఎన్‌పురంలో భూసర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలో జగనన్న భూ సర్వే చురుగ్గా జరుగుతోంది. ఇప్పటి వరకూ 20 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా రెండో విడత సర్వేను సంబంధిత అధికారులు వేగవంతం చేశారు. శుక్రవారం వీఎన్ పురం రెవెన్యూ గ్రామంలో డ్రోన్ సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీఆర్వో శ్యామ్, సర్వే అసిస్టెంట్ కొంకి గణేష్‌లు మాట్లాడుతూ.. వీఎన్ పురంలో 105 సర్వే నంబర్లు ఉండగా.. 410 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. వీటిని వివరంగా రీ సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు. సర్వేలో ప్రతినిధులు నవీన్, భాను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



బొర్రంపేట కేంద్రాన్ని పరిశీలిస్తున్న జయదేవ్

ఎల్.ఎన్.పేట: సిద్ధాంతం, బొర్రంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ జయదేవ్ శుక్రవారం పరిశీలించారు. రికార్డుల నిర్వాహణ, పిల్లల హాజరు, బాలింతలు, గర్భిణుల వివరాలు, పౌష్టికాహార సరుకుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. బొర్రంపేట కేంద్రాన్ని ఓ ఇంటివద్ద నిర్వహించడాన్ని గుర్తించిన ఆయన పాఠశాల వద్దకు మార్చాలని కార్యకర్తకు సూచించారు. ఆమెతో పాటు సూపర్ వైజర్లు జ్యోతిలక్ష్మి, నవభారతి ఉన్నారు.

ఎంప్లాయిూస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



అసోసియేషన్ కార్యవర్గ జాబితాను అందజేస్తున్న ఎన్నికల అధికారి

నరసన్నపేట: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ నరసన్నపేట సమితి యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడుగా కె.నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులుగా బీఎస్ ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా వైవీ రామారావు, సహాయ కార్యదర్శిగా పి.జ్యోత్స్న, కోశాధికారిగా ఎ.శంకరరావు నియమితులయ్యారు. అలాగే జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జె.గోపాలరావు, జి.మోహనరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్.చలపతిరావు, టి.సంధ్యలను ఎన్నుకున్నారు. ఎన్నిల అధికారిగా కేవీఆర్ మూర్తి వ్యవహరించారు.

టీపఆర్‌ఎల్ పరీక్షల పరిశీలన



పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న రమణ

సారవకోట: మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు టీపఆర్‌ఎల్ (తర్ల) పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పఠనా సామార్థ్యలను ఎంఈవో ఎంవీ రమణ పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఉన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన బైక్ యాత్రికుడు



రాజుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: బైక్‌పై రాష్ట్రంలో యాత్ర చేస్తున్న నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవికోట్ల రాజు శుక్రవారం పాతపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే రెడ్డి శాంతిని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఏడాది మే 14వ తేదీన తమ గ్రామం నుంచి బైక్ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 139 నియోజకవర్గాలు పూర్తి చేశానన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు.

అందుబాటులో ఎరువులు

కొత్తూరు: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అంపిలి బుచ్చిబాబు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం సలహా మండలి సమావేశం జరిగింది. రాయితీ విత్తనాల సరఫరా వివరాలను వెల్లడించారు. ఏవో శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేవకులకు సలామ్

స్వచ్ఛందంగా ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లకు వివిధ సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కన్నబిడ్డలా..అన్నలా.. చెల్లిలా..తమ్ముడులా తమకు అండగా ఉంటున్నారంటున్నారు. కష్టకాలంలో తామున్నామంటూ ముందుకొచ్చి ఆదుకుంటున్నారని.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ సక్రమంగా అందించి చేదోడువాదోడుగా నిలుస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారికి సలామ్ అంటున్నారు.

–ఎల్.ఎన్.పేట, బూర్జ, హిరమండలం

ఇంటికి వచ్చి.. సేవలు అందించి..



మా వలంటీర్ గంటా ఆమని ఇంటివద్దకే వచ్చి పథకాలకు సంబంధించిన వివరాలు చెప్పి వెళ్తారు. నా భర్తకు ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే వచ్చి పింఛన్ అందిస్తుంది. మా కుటుంబానికి అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతుభరోసా వంటి పథకాలు మంజూరులో వలంటీర్లదే కీలకపాత్ర. ఇంత మంచి సేవలు అందిస్తున్న వలంటీర్‌క సలామ్.

–నీలాపు చిన్నమ్మి, రచ్చబండవీధి, సుభలయ, హిరమండలం

ఎంతో సంతోషపడ్డాను



నేను అనారోగ్యంతో శ్రీకాకుళంలోని కిమ్స్ ఆస్పత్రిలో చేరాను. మందులు, ఆస్పత్రి ఖర్చుల కోసం డబ్బులకు ఇబ్బందిగా ఉండేంది. అదే సమయంలో మా వలంటీరు లంక సౌందర్య ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులు అందించి ఆదుకుంది. ఆ రోజు ఎంతో సంతోషపడ్డాను. అంత దూరం నుంచి వచ్చావు కదా టీ తాగి, చార్జీలు కట్టుకోమని డబ్బులు ఇస్తే తీసుకోలేదు. ఇలాంటి వలంటీర్లు ఉండటం మాలాంటి పేదలకు ఎంతో మేలు.

–టి.అప్పలనరసమ్మ, ఎల్.ఎన్.పేట

కూతురులా అండగా నిలబడింది..



నేను గుండె సంబంధిత సమస్యతో శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేరారు. ఈ ఏడాది మార్చిలో ఆరోగ్యశ్రీ ద్వారా గుండెకు ఆపరేషన్ జరిగింది.దీంతో కొద్ది రోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో మా గ్రామ వలంటీర్ కొరికాన సునీత ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందజేశారు. కష్టసుఖాలు అడిగి తెలుసుకోవడంతోపాటు కూతురులా ధైర్యం చెప్పింది. 70 ఏళ్ల వయసులో వలంటీరే అండగా నిలబడింది.

–లుకలాపు అప్పారావు, అప్పలపేట, బూర్జ మండలం

కరోనా సమయంలో మెరుగైన సేవలు



కరోనా సమయంలో మా వలంటీరు ఇప్పిలి తులసి మెరుగైన సేవలందించారు. ఇంటికి వచ్చి మరీ నెలవారీ జీతం మాదిరిగా పింఛను అందించేది. వీటితోపాటు కూరగాయాలు, మందులు అందించి ధైర్యం చెప్పేవారు. బంధువుల యోగ క్షేమాలు సైతం తెలుసుకొని చెప్పేవారు. వారి సేవలు ఎంతో గొప్పవి.

–పొట్నూరు అప్పారావు, జలుమూరు గ్రామం

అర్హులందరికీ సు‘రక్ష’

జగనన్న సురక్ష కార్యక్రమం వివిధ గ్రామాల్లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ప్రజలకు రక్షణగా నిలుస్తోందని చెప్పారు. 11 సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నరసన్నపేట, పాతపట్నం ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతిలు పలు గ్రామాల్లో నిర్వహించిన సురక్ష కార్యక్రమాల్లో పాల్గొని ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



నరసన్నపేట: చిక్కాలవలసలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: రొంపివలసలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీడీవో జయంత్‌ప్రసాద్



కొత్తూరు: మదనాపురంలో సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం



మెళియాపుట్టి: సిరియాఖండిలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: చినకాగితాపల్లిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆమదాలవలస రూరల్: జి.కె.వలసలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రత్యేక ఆహ్వానితుడు శ్రీరామ్మూర్తి

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- జిల్లోడిపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

హిరమండలం: పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. కల్లట సచివాలయం పరిధిలోని జిల్లోడిపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షమ పథకాలను ప్రజలకు వివరించారు. చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఇంటి వద్దకే పథకాలు అందిస్తూ సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల మనస్సులో సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజెస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి

గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అవస్థలు పడేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.మురళీమోహన్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ అంగూరు భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి జగదీశ్వరరావు, వి.బాలరాజు, ఎం.రామారావు, ఉండటి మన్మథరావు, మామిడి చిరంజీవులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఎనలేని అభివృద్ధి

కొత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గొట్టిపల్లి, అడ్డంగి, కారిగూడ, లబ్బ, ఓంద్రుజోల పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలు ఎనలేని అభివృద్ధి చెందాయని గిరిజన నాయకులు తెలిపారు. కారిగూడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు సవర మోహనరావు, మాజీ సర్పంచ్ సంబురు, పలువురు గిరిజన నాయకులు గొట్టిపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందలేదని కొంత మంది చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో గిరిజన గ్రామాలకు పక్కా రోడ్లు వేయడంతో పాటు పలు రోడ్లను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాం నిర్లక్ష్యానికి గురైన మెట్టూరు నుంచి గొట్టపల్లి వరకు ఉన్న రోడ్డును రూ. 6 లక్షలతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గొట్టిపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాడు-నేడు పథకం ద్వారా ఫేజ్ -1లో



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

రూ. 75 లక్షలు, ఫేజ్-2లో రూ. 85లతో అభివృద్ధి చేసినట్టు పేర్కొన్నారు. చినరాజపురం పాఠశాలలో రూ. 18 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పలు గిరిజన గ్రామాల్లో పది బోర్లు తవ్వించినట్టు వివరించారు. కోతండూ, చీపురుపల్లి, కొత్తపల్లి, పుల్లగూడ, డెప్పిగూడ, కాకరగూడ, రాజపురం తదితర గ్రామాలకు రూ. 45 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. గిరిజన నాయకులు భాస్కరరావు, ఆనందరావు, సింహాద్రి, అప్పారావు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో భాగంగా జీవామృతం తయారీపై రైతులకు సంబంధిత ఎస్‌ఎఫ్‌ఏ గోవిందరెడ్డి అవగాహన కలిగించారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జీవామృతం తయారీ, వినియోగం కోసం రైతులకు పలు సూచనలు చేశారు. మనకు సహజ సిద్ధంగా లభించే గోమూత్రం, ఆవుపేడ, శనగపిండి, బెల్లం, పుట్టమన్ను తీసుకుని వారం రోజుల పాటు మురగబెట్టాలని సూచించారు. ఇలా తయారు చేసుకున్న ద్రవ జీవామృతం



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూరగాయల మొక్కలకు, నారుమడులకు వాడుకోవచ్చన్నారు. రైతులు ఊర్న పకీరు, ఆశోక్ పాణిగ్రహి పాల్గొన్నారు.

శివారు గ్రామాలపై చిన్నచూపు

పోలాకి: శివారు గ్రామాల అభివృద్ధిపై గత టీడీపీ ప్రభుత్వం చిన్నచూపు చూసిందని జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సంతలక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని సన్యాసిరాజుపేట గ్రామంలో సీసీ రహదారిని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇక్కడ పవర్‌ప్లాంట్ కట్టి గ్రామస్తులను తరిమేస్తామంటే ఈ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు. అనంతరం డోల, తలసముద్రం సచివాయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పరిషత్ సలహాదారు మద్దాడ భైరాగినాయుడు, మండల వ్యవసాయసలహాసంఘం చైర్మన్ డోల ఉదయ్‌భాస్కర్, తహసీల్దార్ శ్రీరాములు, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.



డోలలో సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణచైతన్య

19న మండల సమావేశం

సారవకోట: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విశ్వేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎంపీ పీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు రొట్టవలసకు స్పీకర్ రాక

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామానికి స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం రానున్నట్టు వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను స్పీకర్ ప్రారంభిస్తారన్నారు.

పవన్ కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి



కొత్తూరు: మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ తక్షణమే వారికి బహిరంగా క్షమాపణ చెప్పాలని కొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు ధర్మారావు, సాధుబాబులు డిమాండ్ చేశారు. కొత్తూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేస్తున్న విషయాన్ని చూసి ఓర్వలేక వారిపై లేనిపోని విమర్శలు చేస్తుండడం తగదన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నాయకులు బూర్లె శ్రీనివాసరావు, నాగేంద్ర, లింగం, శంకర్, కృష్ణమోహన్, మోహనరావు లు ఉన్నారు.

వలంటీర్లను విమర్శించడం తగదు

పొందూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నిస్వార్థంగా చేరువ చేస్తున్న వలంటీర్లను జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ విమర్శించడం తగదని పొందూరు ఎంపీపీ కిల్లి ఉషారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఇంటి వద్దకే అన్ని సేవలను వలంటీర్ల అందజేస్తున్నారని.. అటువంటి వారిపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు.



ఉషారాణి

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే దిక్సూచిగా ఉందన్నారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పవన్‌కళ్యాణ్‌పై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న వలంటీర్లు

పోలాకి: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై ఉర్జాం పంచాయతీ వలంటీర్లు పోలాకి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పవన్‌పై దిశచట్టం కింద కేసున మోదు చేయాలని కోరుతూ ఎస్ఐ సత్యనారాయణకు ఫిర్యాదు అందజేశారు. వలంటీర్లు రాజేశ్వరి, హేమలత, సునీత, స్వాతి, లావణ్య, లక్ష్మణరావు, కృష్ణారావు, కొండలరావు, అప్పన్న ఉన్నారు.

విద్యార్థులకు సత్కారం

హిరమండలం: చదువుకు పేదరికం అడ్డంకి కాదని తహసీల్దార్ బి.మురళీమోహన్, మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 11 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సన్మానించి గౌరవించారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ప్రధానోపాధ్యాయులు కేశవరావు, ఎస్.రామకృష్ణ, ఎస్.కృష్ణవేణి, వై.రామారావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

బోరు పనులు ప్రారంభం

బూర్జ: పెద్దపేట సచివాలయం పరిధి బొమ్మిక గ్రామంలో జలజీవన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం బోరు నిర్మాణ పనులను పీఏసీఎస్ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు శుక్రవారం ప్రారంభించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కృషితో కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఉప సర్పంచ్ డి.వి.నాయుడు, శ్రీను, పి.లక్ష్మణరావు, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

14 మంది జనసేన కార్యకర్తలపై కేసు నమోదు

కొత్తూరు: ఎటువంటి అనుమతులు లేకుండా కొత్తూరులోని నివగాం రోడ్డులో శుక్రవారం ర్యాలీ చేసిన 14 మంది జనసేన పార్టీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.గోవింద్ తెలిపారు. ర్యాలీ చేయడంతోపాటు పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినందుకు కేసులు నమోదు చేసినట్టు స్పష్టం చేశారు.

కళ్లకలక పట్ల అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: కళ్ల కలకలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారులు టి.సాగరిక, జి.రమేష్‌నాయుడులు అన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా లోలుగు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలో ఉన్న కేజీబీవీలో హెల్త్‌మేళా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హెపటైటిస్, కాంట్రాసెప్టివ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

సరుబుజ్జిలి: కొత్తకోట గ్రామానికి చెందిన కాగితాపల్లి నవీన్‌కుమార్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఒంగోలు క్యాంపస్‌లో సీటు వచ్చింది. విద్యార్థి తండ్రి గోవిందరావు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, తల్లి శైలజ గృహిణి. టెన్త్ కొత్తకోట జడ్పీహైస్కూల్‌లో చదివి 571 మార్కులు సాధించాడు. ఏపీఆర్‌జేసీలో కూడా ర్యాంకు సాధించి నాగార్జునసాగర్‌లో సీటు వచ్చినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

పశుగ్రాసం సాగు పరిశీలన

ఆమదాలవలస: పశుగ్రాసం పెంపకంతో పాడి రైతులకు మేలు జరుగుతుందని ఆమదాలవలస పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఆర్.ఆనందరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి కొత్తకోటవారి వీధి శివార్లలో పాడిరైతు పి.సత్యనారాయణ పొలంలో సాగుచేస్తున్న పశుగ్రాసాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతులకు గ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. గ్రాసం పెంపకంతో పాడి రైతుకు దాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పాలటెక్నిక్ అగ్రికల్చర్ విద్యార్థులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు

ఆమదాలవలస: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) శుక్రవారం కోరారు. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి స్థానిక ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో గొలివి ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తాన్ని దానం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలలో రోడ్డు పనులు ప్రారంభం

బూర్జ: ఓ.వి.పేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నాడు-నేడు పథకం నిధులు రూ.51 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులకు వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు-నేడు పథకంతో పాఠశాలలకు మహర్దశపట్టిందన్నారు. సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, చైర్మన్ ఈపి చిన్నారావు, హెచ్‌ఎం నారాయణస్వామి పాల్గొన్నారు.

స్వామిజీ పూజలు

నరసన్నపేట: స్థానిక సంతపేటలోని భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి నెల్లూరు జిల్లా కావలికి చెందిన విజయదుర్గా సంస్థానాధీసులు పత్రి వీరబ్రహ్మయ్య స్వామిజీ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిజీకి ఆలయ మర్యాదలతో అర్చకులు దుర్గామల్లికార్జున స్వామి స్వాగతం పలికారు. ఆలయ పునర్‌నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కు మిసైల్‌మ్యాన్ అవార్డు

కొత్తూరు: కొత్తూరు మండలం గూనభద్ర ఆర్ఆర్ కాలనీకి చెందిన విద్యావేత్త, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్ కుమార్‌ను మిసైల్‌మ్యాన్ అవార్డుకు ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎంపిక చేసింది. డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా విజయవాడలో ఈ నెల 27 తేదీన నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్‌కు అవార్డును ప్రదానం చేయనున్నారు.

సలహా మండలి చైర్మన్‌కు అభినందన

పోలాకి: మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్‌గా ఎంపికైన డోల ఉదయభాస్కర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య డోల గ్రామంలో శుక్రవారం అభినందించారు. రైతులకు మెరుగైన సేవలందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైభవంగా కుంకుమ పూజలు

కొత్తూరు: కొత్తూరులోని రామాలయంలో శుక్రవారం లలితా సహస్రనామ సహిత కుంకమ పూజ వైభవంగా జరిగింది. తిరుపతికి సమీపంలోని శ్రీశక్తి పీఠాధీశ్వరిమంత్ర మహేశ్వరి మాతాజీ రమ్యానంద భారతి మహిళలతో పూజలు నిర్వహించారు. కొత్తూరుకు చెందిన వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు శ్రీదేవి దంపతుల సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు.



కుంకమ పూజల్లో పాల్గొన్న భక్తులు